ప్రచురణార్హమైన

# భారత దేశ సర్వోన్నతన్యాయస్థానము

(క్రిమినల్/సివిల్ అప్పీలు కేసుల పరిధిలో)

క్రిమినల్ అప్పీలు నెం.1978/2013

**రాజారాం, తండ్రి: శ్రీరాములు నాయిడు**

**(మరణాంతరం) వారి చట్టబద్ధప్రతినిధుల ద్వారా ...అప్పీలుదారు(లు)**

**మరియు**

**మారుతాచలం**

**(మరణాంతరం) వారి చట్టబద్ధప్రతినిధుల ద్వారా ...ప్రతివాది(లు)**

క్రిమినల్ అప్పీలు నెం.1990 / 2013

సివిల్ అప్పీలు నెం.10500 / 2013

సివిల్ అప్పీలు నెం.10501 / 2013

లతో పాటు

తీ ర్పు

**న్యాయమూర్తి, బి.ఆర్.గవాయ్,**

**1.** మద్రాసు హైకోర్టు తేదీ 28 అక్టోబర్ 2008 మరియు 30 అక్టోబర్ 2008లలో, నెగోషియబుల్ 1881 (నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881) (ఈ తదుపరి "ఎన్.ఐ.చట్టం"గా సూచించబడును) సెక్షన్ 138 కింద అప్పీలుదారున్ని దోషిగా నిర్ధారిస్తూ ప్రతి రూ.3.50 లక్షల రెండు చెక్కులకు సంబంధించి ఒక్కో కేసులో రూ.7లక్షల చొప్పున జరిమానా

విధిస్తూ వెలువరించిన శిక్షను మరియు ఉమ్మడి తీర్పును సవాలు చేస్తూ ఇక్క డి క్రిమినల్ అప్పీ ళ్లు దాఖలు అయ్యాయి.

2. ప్రామిసరీ నోట్ల ఆధారంగా డబ్బు వసూలు చేయడానికి వాదులు (ఇక్కడి ప్రతివాదులు) వేసిన ఒరిజినల్ దావాలకు సంబంధించి తేదీ 8 ఆగస్టు 2011 మరియు తేదీ 3 ఫిబ్రవరి 2012లలో మద్రాసు హైకోర్టు వెలువరించిన తీర్పులను సవాలు చేస్తూ ఇక్కడ సివిల్ అప్పీళ్లు దాఖలు అయ్యాయి.

3. సౌలభ్యం కోసం , కక్షిదారులను ఈ న్యాయస్థానం ముందున్న హోదాతో నే సంబోధించడం జరిగింది.

4. ఇక్కడి రెండు క్రిమినల్ అప్పీళ్లు ఒకే తీర్పు నుండి ఉత్పన్నమ యినాయి కాబట్టి క్రిమినల్ అప్పీలు నెం.1978/2013లోని వాస్తవాలను పరిగణలోకి తీసుకోవడం సముచితమని మేము భావిస్తున్నాము. సివిల్ అప్పీళ్ల విషయానికొస్తే అవి వివిధ తీర్పుల నుండి ఉద్భవించినప్పటికీ సౌలభ్యం కోసం మేము సివిల్ అప్పీలు నెం.10501/2013లో ఉన్నటువంటి వాస్తవాలను పేర్కొన్నాము.

5. ప్రస్తుత అప్పీళ్లు ఈ క్రింది వాస్తవిక మాతృక నుండి ఉత్పన్నమయినాయి:

5.1. క్రిమినల్ అప్పీలు నెం .1978/2013 మరియు సివిల్ అప్పీలు నెం .10500/2013లలో ప్రతివాది అయిన మారుతాచలం అనే వ్యక్తి దగ్గర 1992లో అప్పీలుదారు –రాజారాం భార్య 5 సంవత్సరాల చిట్ –ఫండ్ సభ్యత్వం తీసుకుంది. చీటీ వేలందారుగా ఉండటానికి బ్లాంకు(ఖాళీ) చెక్కు ద్వారా భద్రతని తప్పనిసరిగా ఇవ్వాలని ప్రతివాది –మారుతాచలం ఒప్పించడంతో, తన భార్యకు బ్యాంకు ఖాతా లేనందున అప్పీలుదారు తను తన సంతకం చేసిన 237954 మరియు 237956 అను నెంబర్లు గల రెండు ఖాళీ చెక్కులను తన భార్య తరపున ఇచ్చాడు. లక్ష్మీ విలాస్ బ్యాంక్ లిమిటెడ్‌తో నిర్వహించబడుతున్న, అప్పీలుదారు ఏకైక యాజమా నిగా ఉన్న సంస్థ ఎం./ఎస్.బృందా ఇంజనీరింగ్, ఖాతా నుండి చెక్కులు జారీ అయినట్లు గమనించాల్సిన విషయం.

5.2. అప్పీలుదారు ఇంకా తెలియజే సినది ఏమనగా 1995లో తన భార్య ప్రతివాది –మారుతాచలం దగ్గర మరో 5 సంవత్సరాల చీటీ సభ్యత్వాన్ని తీసుకుంది.

**5.3.** పైన పేర్కొన్న చెక్కుల యొక్క బ్యాంకు ఖాతా వాడకంలో లేనందున , 1997లో మూసి వేయబడింది.

**5.4.** మొదటి చీటీ 1997లో పరి ణితి చెందింది మరియు అప్పీలుదారు భార్య ఎప్పుడూ విజయవంతమైన వేలందారు కానందున, అప్పీలుదారు మరియు అతని భార్య చీటీ మొత్తాన్ని విడుదల చేయమని ప్రతివాదిని పదేపదే అభ్యర్థించారు, కానీ ప్రతివాది అందుకు ఎప్పుడూ ఒప్పుకోలేదు. అందుకు విరుద్ధంగా, ప్రతివాది ఆ మొత్తాన్ని జమ(డిపాజిట్) గా ఉంచుతానని మరియు వడ్డీ చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. అదేవిధంగా, రెండవ చీటీ 1999లో పరిణతి చెందింది, ఆ తర్వాత కూడా అప్పీలుదారు భార్య ఎప్పుడూ విజయవంతమైన వేలందారు కాలేకపోయింది. ఆ తర్వాత, వారి తరపున చెల్లించిన రెండు చీటీల చందా మొత్తం రూ.6 లక్షలను విడుదల చేయమని పదేపదే అభ్యర్థనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరగా, అప్పీలుదారు మరియు అతని భార్య చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రతివాదిని బెదిరించారు, ఆ తర్వాత ప్రతివాది వెంటనే, అప్పీలుదారుకు ఎటువంటి సమాచారం లేదా సూచన లేకుండా చెక్కులను నగదు కోసం బ్యాంకులో సమర్పించారు.

**5.5.** ప్రతివాది–నాచిముత్తు(మారుతాచలం యొక్క బావమరిది) కు అనుకూలంగా చెక్కు నెం.237954 పైన రూ.3,50,000, తేదీ.20 అక్టోబర్ 1999గా రాయబడింది మరియు ప్రతివాది 4 నవంబర్ 1999న నగదు కోసం తన బ్యాంకర్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో ఈ చెక్కును సమర్పించారు. "ఖాతా మూసి వేయబడింది" అనే కారణంతో ఆ చెక్కు చెల్లకుండా 14 నవంబర్ 1999న తిరిగి ఇవ్వబడింది.

**5.6.** ప్రతివాది–మారుతాచలంకు అనుకూలంగా మరొక చెక్కు నెం.237956 పైన రూ.3,50,000, తేదీ.25 అక్టోబర్ 1999గా రాయబడింది మరియు ప్రతివాది 4 నవంబర్ 1999న తన బ్యాంకర్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో నగదు కోసం ఈ చెక్కును సమర్పించారు. "ఖాతా మూసి వేయబడింది" అనే కారణంతో ఆ చెక్కు చెల్లకుండా 14 నవంబర్ 1999న తిరిగి ఇవ్వబడింది.

**5.7.** పైన పేర్కొన్న చెల్లని చెక్కులకు సంబంధించి 15 నవంబర్ 1999న చట్ట పరమైన నోటీసులు పంపబడ్డాయి, వీటికి నిందితుడు/అప్పీలుదారు చట్టబద్ధంగా చెల్లించవలసిన రుణం ఏదీ లేదని ఖండిస్తూ సమాధానం పంపాడు మరియు ప్రతివాది తదుపరి –వడ్డీతో సహా చిటీ నగదు మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుందని అందులో పేర్కొన్నాడు. చెక్కుల మొత్తం చెల్లించనందున, ప్రతివాదులు ఎన్.ఐ.చట్టంలోని లోని సెక్షన్ 138 ప్రకారం ఫిర్యాదులను నమోదు చేశారు, చెక్కు నెం.237954కు సంబంధించి సి.సి.నెం.26/2000 మరియు చెక్కు నెం.237956కు సంబంధించి సి.సి.నెం.32/2000 కేసులు నమోదయ్యాయి. ఈ రెండు కేసులను తేదీ .10 జూలై 2001న వేర్వేరు తీర్పుల ద్వారా ట్రయల్ కోర్ట్ కొట్టివేసింది.

**5.8.** పైన పేర్కొన్న కేసులను కొట్టివేసిన తరువాత, ప్రతివాదులు ఇద్దరూ ప్రామిసరీ నోట్ల ఆధారంగా డబ్బు వసూలు చేయుట కోసం సివిల్/ఒరిజినల్ దావాలను దాఖలు చేశారు.

**5.9.** ప్రతివాది–నాచిముత్తు వేసిన ఒరిజినల్ దావా నెం.112/2003 (మునుపటి ఓ.ఎస్.నెం.602/2022) లోని ఆరోపణ ఏమనగా అప్పీలుదారు తేదీ.20 అక్టోబర్ 1998న అతని నుండి రూ.3 లక్షల రుణం తీసుకొని అదే రోజు ప్రామిసరీ నోటును రాసిచ్చి తద్వారా సంవత్సరానికి 24% వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. తదుపరి ఆరోపణ ఏమనగా అప్పీలుదారు తన రుణబాధ్యతను నెరవేర్చడానికి తేదీ.20 అక్టోబరు 1999న రూ.3,50,000 చెక్కును ఇచ్చాడు, దానిని నగదు కోసం సమర్పించినప్పుడు అప్పీలుదారు బ్యాంకు ఖాతా మూసివేయబడిన కారణంగా అట్టి చెక్కు చెల్లించబడలేదు. తదుపరి ఎన్.ఐ.చట్టంలోని సెక్షన్ 138 ప్రకారం వేయబడి న క్రిమినల్ కేసు నెం.32/2000 కొట్టివేయబడి నందున దానికి వ్యతిరేకంగా హైకోర్టులో దాఖలైన అప్పీలు పెండింగులో ఉంది.

**5.10.** ప్రతివాది–మారుతాచలం వేసిన మరొక ఒరిజినల్ దావా నెం.266/2004 (మునుపటి ఓ.ఎస్.నెం.746/2002) లోని ఆరోపణ ఏమనగా అప్పీలుదారు తేదీ.25 అక్టోబర్ 1998న అతని నుండి రూ.3 లక్షల రుణం తీసుకొని తేదీ .25 అక్టోబర్ 1998న ప్రామిసరీ నోటును రాసిచ్చి తద్వారా సంవత్సరానికి 24% వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. తదుపరి ఆరోపణ ఏమనగా అప్పీలుదారు తన రుణబాధ్యతను నెరవేర్చడానికి తేదీ .25 అక్టోబరు 1999న రూ.3,50,000 చెక్కును ఇచ్చాడు మరియు దానిని నగదు కోసం సమర్పించినప్పుడు అప్పీలుదారు బ్యాంకు ఖాతా మూసివేయబడిన కారణంగా అట్టి చెక్కు చెల్లలేదు. తదుపరి ఎన్ .ఐ.చట్టంలోని సెక్షన్ 138 ప్రకారం

వేయబడిన క్రిమినల్ కేసు నెం. 26/2000 కొట్టివేయబడి నందున దానికి వ్యతిరేకంగా హైకోర్టులో దాఖలైన అప్పీలు పెండింగులో ఉంది.

**5.11.** తేదీ.6 జనవరి 2004న వెలువడిన తీర్పు ద్వారా ఒరిజినల్ దావా నెం.112/2003 మరియు తేదీ.29 జూలై 2005న వెలువడిన తీర్పు ద్వారా ఒరిజినల్ దావా నెం.26/2004లు కొట్టివేయబడ్డాయి. ఈ రెండు తీర్పులకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేయబడ్డాయి.

**5.12.** అట్టి క్రిమినల్ కేసులలో తీర్పులకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లను అనుమతిస్తూ హైకోర్టు తేదీ.28.10.2008 మరియు తేదీ .30 అక్టోబర్ 2008లలో ఉమ్మడి తీర్పు ద్వారా నేరాన్ని నిర్ధారిస్తూ శిక్ష విధించింది.

**5.13.** ఒరిజినల్ దావా నెం.266/2004 మరియు ఒరిజినల్ దావా నెం.112/2003ల యొక్క అప్పీళ్ళను అనుమతిస్తూ హైకోర్టు తేదీ .8 ఆగస్టు 2011న మరియు తేది .3 ఫిబ్రవరి 2012న తీర్పులను వెలువరించింది.

**5.14.** హైకోర్టు యొక్క మొత్తం 3 తీర్పులకు వ్యతిరేకంగా దాఖలైన ప్రస్తుత అప్పీళ్లు మా ముందు ఉన్నాయి మరియు ఇక్కడి ఉమ్మడి తీర్పు ద్వారా అవి పరిష్కరించబడుతాయి.

**6.** అన్ని అప్పీళ్ళలో అప్పీలుదారుల తరపున హాజరైన న్యాయవాది శ్రీమతి నేహా శర్మ మరియు అన్ని అప్పీళ్ళలో ప్రతివాదులిద్దరి తరపున హాజరైన న్యాయవాది శ్రీ వి. ప్రభాకర్ ల వాదనలు విన్నాము.

**7.** విచారణ న్యాయస్థానం (ట్రయల్ కోర్టు) యొక్క సహేతుకమైన సకారణాలతో వెలువడిన తీర్పులను హైకోర్టు పొరపాటుగా తిరగరాసిందని శ్రీమతి నేహా శర్మ నివేదించారు. చీటీ–ఫండ్.ల కోసం భద్రతగా 1992లో జారీ చేసిన ఖాళీ చెక్కులను, 1999లో ప్రతివాదులు దుర్వినియోగం చేశారని ఆమె పేర్కొన్నారు. 1999లో చెక్కులను నగదు కోసం సమర్పించినపుడు , అప్పీలుదారు ఎం./ఎస్.బృందా ఇంజినీరింగ్ సంస్థకు యజమానిగా లేరని మరియు ఆ చెక్కులు జారీ చేయబడిన బ్యాంకు ఖాతా 1992 తర్వాత నిర్వహించబడలేదని మరియు 1997 కంటే ముందే నిర్వహించబడ

నందున ఖాతా మూసివేయబడిందని ఆమె పేర్కొన్నారు. ఖాతా మూసివేయబడక ముందే , అప్పీలుదారుడి భార్య ఆ సంస్థకు ఏకైక యజమాని అయిందని, అందువల్ల, అప్పీలు దారుడు ఎం./ఎస్.బృందా ఇంజనీరింగ్ సంస్థ యజమాని హోదాలో ఆ చెక్కులపై సంతకం చేయలేదని ఆమె పేర్కొన్నారు.

**8.** ప్రామిసరీ నోట్లు రాయబడినట్లు చెప్పబడిన తేదీ .2 అక్టోబర్ 1998 మరియు తేదీ.25 అక్టోబర్ 1999 నాటికి ప్రతివాదులలో ఒక్కొక్కరికి రూ .3,00,000/- మొత్తాన్ని రుణంగా ఇచ్చే ఆర్థిక సామర్థ్యం లేదని న్యాయవాది నివేదించారు. ప్రతివాదులు తమ వ్యవసాయ ఆదాయం నుండి మొత్తాలను రుణంగా ఇచ్చారని చెప్పినప్పటికీ , వారు 1992 నుండి 1999 వరకు తమ ఆదాయపు పన్ను వివరణ(ఐ.టి.రిటర్న్స్) లలో ఆ డబ్బును చూపనందున , వారు ఆ మొత్తాన్ని అప్పుగా ఇవ్వగలిగారు అని నిరూపించడానికి ఎటువంటి ఆధారం లేదని పేర్కొన్నారు. న్యాయవాది తన సమర్పణలను బలోపేతం చేయడానికి ఈ అత్యున్నత న్యాయస్థానం **బసలింగప్ప వర్సెస్ ముదిబసప్ప**[1] కేసులో వెలువరించిన తీర్పుపై ఆధారపడ్డారు.

**9.** ప్రతివాదుల తరపు న్యాయవాది శ్రీ వి. ప్రభాకర్ అందుకు విరుద్ధంగా, అప్పీలుదారుని భార్య, ప్రతివాది-మారుతాచలం నడుపుతున్న చిట్-ఫండ్.లలో సభ్యత్వాన్ని పొందిందనే వాదనను ధృవీకరించడానికి ఎటువంటి సాక్ష్యమునైనను సమర్పించడంలో అప్పీలుదారు-రాజారాం విఫలమయ్యారని పేర్కొన్నారు. చెక్కులు, ప్రామిసరీ నోట్లు అటువంటి చీటీ-ఫండ్ లకు భద్రతగా మాత్రమే జారీ చేయబడ్డాయని నిరూపించడానికి అప్పీలుదారు-రాజారాం ఎటువంటి ఆధారాన్ని సమర్పించలేదని హైకోర్టు సరిగ్గా గమనించినట్లు ఆయన పేర్కొన్నారు. అప్పీలుదారు తనకు చెల్లించాల్సిన అని చెప్పబడే మొత్తాన్ని వసూలు చేయుటకు ఎటువంటి చట్టపరమైన చర్యలు చేపట్టలేదని కూడా ఆయన పేర్కొన్నారు.

**10.** 1992లో, ఆ తర్వాతి కాలం 1995లో చీటీ-ఫండ్.ల కోసం అప్పీలుదారు -రాజారాం ఖాళీ చెక్కులు జారీచేయడానికి ఎటువంటి సందర్భం లేదని న్యాయవాది పేర్కొన్నారు. వీటితోపాటు తెలియజేసినది ఏమనగా నిర్దిష్ట మొత్తాలు ఆదాయపు పన్ను వివరణ(ఐ.టి.రిటర్న్స్) లలో లెక్క చెప్పనప్పటికీ, అది పన్ను-ఎగవేతదారునికి మరియు రెవెన్యూ అధికార విభాగానికి మాత్రమే

---

**[1] ( 2019) 5 SCC 418**

సంబంధించిన విషయమని పేర్కొన్నారు. అందువల్ల అటువంటి మొత్తాలు ఆదాయపు పన్ను వివరణలలో ప్రతిబింబించలేదు అను కారణం ఆసరాతో రుణగ్రహీత దానిని దుర్వినియోగ ప్రయోజనాలకు అనుమతింపబడకూడదు అని పేర్కొన్నారు. ప్రతివాదుల–న్యాయవాది తన వాదనలకు మద్దతుగా, **బిర్ సింగ్ వర్సెస్ ముఖేష్ కుమార్**[2], **రోహిత్ భాయ్ జీవన్ లాల్ పటేల్ వర్సెస్ గుజరాత్ రాష్ట్రం & ఇతరులు**[3] మరియు **కళామణి టెక్స్ & ఇతరులు వర్సెస్ పి.బాలసుబ్రమణియన్**[4] అను కేసులలో ఈ న్యాయస్థానం ఇచ్చిన తీర్పులపై ఆధారపడ్డారు.

11. మేము మొదట క్రిమినల్ అప్పీళ్లను పరిశీలిస్తాము.

12. ఈ న్యాయస్థానం **బసలింగప్ప వర్సెస్ ముదిబసప్ప** (పైన పేర్కొన్న) కేసులో ఎన్.ఐ.చట్టములోని 118(ఎ) మరియు 139 సెక్షన్లపై సూత్రాలను సంగ్రహించింది. సముచితమని అట్టి సూత్రాలను మళ్ళీ ఇక్కడ సూచించడం జరిగింది.

> 25. ఈ న్యాయస్థానం ద్వారా పైన పేర్కొన్న కేసులలో సెక్షన్లు 118(ఎ) మరియు 139 లపై నిర్దేశించిన అనుపాతాన్ని మేము గమనించాము, ఈ న్యాయస్థానం పరిగణించిన సూత్రాలు ఈ క్రింది విధంగా సంగ్రహించబడ్డాయి:
>
> 25.1. ఒకసారి చెక్కు అమలుని అంగీకరించిన తర్వాత సెక్షన్ 139 ప్రకారం ఏదైనా రుణం లేదా ఇతర బాధ్యతను తీర్చడానికే అట్టి చెక్కు నిర్వహించబడింది అని పురోభావించడం తప్పనిసరి.
>
> 25.2. సెక్షన్ 139 ప్రకారం పురోభావన అనేది ఖండించే వీలు కలిగిన పురోభావన మరియు సంభావ్యత రక్షణతో నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితుడిపై ఉంటుంది. పురోభావనను ఖండించడానికి, ప్రాముఖ్యమైన సంభావ్యతలే ప్రామాణిక రుజువులు.

---

[2] **(2019) 4 SCC 197**

[3] **(2019) 18 SCC 106**

[4] **(2021) 5 SCC 283**

**25.3.** పురోభావనను ఖండించడానికి, నిందితుడు తను ప్రవేశపెట్టిన సాక్ష్యముపై ఆధారపడటానికి అవకాశం ఉంది లేదా సంభావ్య రక్షణను పెంచడానికి ఫిర్యాదుదారు సమర్పించిన విషయాలపై కూడా నిందితుడు ఆధారపడవచ్చు. ప్రాముఖ్య సంభావ్యత యొక్క అనుమితిని, కక్షిదారులు నమోదు చేసిన విషయాల నుండి మాత్రమే కాకుండా, వారు ఆధారపడే సంబంధిత పరిస్థితులను సూచించడం ద్వారా కూడా పొందవచ్చు.

**25.4.** నిందితుడు తన రక్షణకు మద్దతుగా సాక్ష్యపు బోనులోకి రావాల్సిన అవసరం లేదు, సెక్షన్ 139 సాక్ష్య భారాన్ని విధించింది, ఒప్పించే భారాన్ని కాదు.

**25.5.** తన రక్షణకు మద్దతుగా నిందితుడు సాక్ష్యపు బోను ఎక్కవలసిన అవసరం లేదు.

**13.** ఈ న్యాయస్థానం విశదీకరణల ప్రకారం ఎప్పుడైతే ఒక చెక్కు యొక్క అమలుని అంగీకరించబడునో అప్పుడు ఆ చెక్కు ఏదైనా రుణం లేదా ఇతర బాధ్యతను తీర్చడానికి నిర్వహించబడింది అని భావించడం తప్పనిసరి అని ఎన్.ఐ.చట్టం లోని సెక్షన్ 139 తెలియజేస్తుంది. అయినప్పటికీని సెక్షన్ 139లో చెప్పబడిన పురోభావన ఖండించే వీలు కలిగిన పురోభావన కావున తన రక్షణ సంభావ్యతలను రుజువు చేసుకోవాల్సిన బాధ్యత నిందితుడిపైన ఉంటుంది . పురోభావనను ఖండించడానికి, ప్రాముఖ్యమైన సంభావ్యతలే ప్రామాణిక రుజువులు. పురోభావనను ఖండించడానికి, నిందితుడు తన ప్రవేశపెట్టిన సాక్ష్యముపై ఆధారపడటానికి అవకాశం ఉంది లేదా సంభావ్య రక్షణను పెంచడానికి ఫిర్యాదుదారు సమర్పించిన విషయాలపై కూడా నిందితుడు ఆధారపడవచ్చు. ప్రాముఖ్య సంభావ్యత యొక్క అనుమితిని, కక్షిదారులు నమోదు చేసిన విషయాల నుండి మాత్రమే కాకుండా, వారు ఆధారపడే సంబంధిత పరిస్థితులను సూచించడం ద్వారా కూడా పొందవచ్చు.

**14.** చెప్పబడిన **బసలింగప్ప వర్సెస్ ముదిబసప్ప** (పైన పేర్కొన్న) కేసులో ట్రయల్ కోర్టు సాక్షాలను మరియు ఆధారాలను పరిశీలించిన తరువాత ఫిర్యాదుదారుడి ఆర్థిక సామర్థ్యానికి సంబంధించి నిందితుడు సంభావ్య రక్షణను లేవనెత్తారని పేర్కొంది. అందువల్ల నిందితుడిని నిర్దోషిగా విడుదల

చేశారు. అట్టి తీర్పు వలన వ్యాధితుడై/అసంతృప్తుడై ఫిర్యాదుదారుడు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసాడు. హైకోర్టు ఆ తీర్పును కొట్టివేసి, నిందితుడిని దోషిగా నిర్ధారించింది. ఫిర్యాదుదారుడి ఆర్థిక సామర్థ్యానికి సంబంధించి ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పు వైరుధ్యంగా ఉందని హైకోర్టు నిర్ధారణకు రాకపోతే, హైకోర్టు ఇందులో జోక్యం చేసుకోవడానికి అనుమతి లేదని ఈ అత్యున్నత న్యాయస్థానం కనుగొంది.

**15.** ప్రస్తుత కేసులో నిందితుడు-అప్పీలుదారుడు సర్కిల్ (II) (5) లోని వార్డ్ నెం.18లోని ఆదాయపు పన్ను అధికారి శ్రీ సర్నాయిన్ ను విచారించారు, ఆయన ఫిర్యాదుదారుని ఆదాయపు పన్ను 1995-96, 1996-97, 1997-98 మరియు 1998-99 ఆర్థిక సంవత్సరాల వివరణల యొక్క ధృవీకరణ పత్రాలను సమర్పించారు. ఫిర్యాదుదారుడు నిందితుడికి రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చినట్లు ప్రకటించలేదని అతని ఆదాయపు పన్ను వివరణల ధృవీకరణ పత్రాలు నిర్ధారించాయి. వ్యవసాయ ఆదాయాన్ని కూడా ఆదాయపు పన్ను వివరణలలో ప్రకటించలేదని రుజువు అయింది.

**16.** మరొక తేటతెల్లమైన విషయమేమనగా ఫిర్యాదుదారు(ల)కు వారు చెప్పిన విధంగా డబ్బు అప్పు ఇవ్వడానికి ఆర్థిక సామర్థ్యం లేదని వారి ఆదాయపు పన్ను వివరణ ద్వారా స్పష్టం అయిందని ట్రయల్ కోర్టు కనుగొంది.

**17.** ఏకైక యాజమాన్య సంస్థ అయిన ఎం./ఎస్.బృందా ఇంజనీరింగ్ చేసిన బ్యాంకు లావాదేవీలకు సంబంధించి సిటీ యూనియన్ బ్యాంకు, రాంనగర్ బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్, డి.డబ్ల్యు.2-తిరు అయ్యప్పన్ ను కూడా అప్పీలుదారుడు విచారించారు.

**18.** నిందితుని తరపున లక్ష్మీ విలాస్ బ్యాంక్, గణపతి బ్రాంచి మేనేజర్, డి.డబ్ల్యు.3-సుబ్రమణ్యంను కూడా విచారించారు. బ్యాంకులో ఖాతా తెరవడానికి నిందితుడిని పరిచయం చేయడానికి దరఖాస్తు ఫారం మీద ఫిర్యాదుదారు సంతకం చేసినట్లు కూడా ఈ సాక్షి సాక్ష్యమిచ్చాడు

**19.** గణపతి గ్రామం యొక్క గ్రామ పరిపాలనా అధికారి, డి.డబ్ల్యు.4-గణేశన్ ను కూడా విచారించారు, ఎస్.ఎఫ్.నెం.591/3 మరియు 592/3లోని వ్యవసాయ భూమి ఉమ్మడి

యాజమాన్యంలో ఉందని, పైన పేర్కొన్న సర్వే నంబర్లలో 27 మంది వ్యక్తుల పేర్లు కనుగొనబడ్డాయని ఆయన సాక్ష్యం చెప్పారు.

**20.** ఈ సాక్ష్యాలన్నింటినీ విశ్లేషించిన తరువాత, ఫిర్యాదుదారుడి ఆదాయపు పన్ను వివరణలు నిందితుడికి రుణం ఇచ్చిన మొత్తాన్ని వెల్లడించలేదని, అతని ప్రకటిత ఆదాయం రూ.3 లక్షల రుణం ఇవ్వడానికి సరిపోదని ట్రయల్ కోర్టు కనుగొంది. అందువల్ల తన వ్యవసాయ ఆదాయం నుండి నిందితుడికి రుణం ఇచ్చానని ఫిర్యాదుదారు చేసిన ఆరోపణ విశ్వసనీయంగా లేదని ట్రయల్ కోర్టు గుర్తించింది. ఫిర్యాదుదారుడు నిందితుడికి రూ.3 లక్షల మొత్తాన్ని అప్పుగా ఇచ్చినారా అనే దానిపై చాలా సందేహం ఉందని కూడా ట్రయల్ కోర్టు వెల్లడించింది. ట్రయల్ కోర్టు కనుగొన్న మరొక విషయమేమనగా 1998 అక్టోబరు 25న నిందితుడు రాసిచ్చాడని ఆరోపించిన ప్రామిసరీ నోటును సాక్ష్యంగా సమర్పించడంలో ఫిర్యాదుదారులు విఫలమయ్యారు . నిందితుని తరపు హాజరైన డిఫెన్స్ సాక్షులను మరియు సంబంధిత పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న తర్వాత నిందితుని యొక్క రక్షణ సంభావ్యత అనేది సాధ్యమయ్యే రక్షణ అని , అందువలన నిందితుడికి "సందేహం యొక్క ప్రయోజనం" (బెనిఫిట్ ఆఫ్ డౌట్ ) పొందే హక్కు ఉందని ట్రయల్ కోర్టు విశ్లేషించింది . పురోభావనను ఖండించడానికి, ప్రాధాన్యతమైన సంభావ్యతలే ప్రామాణిక రుజువులు . ఈ సూత్రాన్ని వర్తింపజేస్తూ, డిఫెన్స్ సాక్షుల సాక్ష్యము మరియు సంబంధిత పరిస్థితుల ఆధారంగా నిందితుడు ఈ పురోభావనను ఖండించినట్లు ట్రయల్ కోర్టు తెలిపింది.

**21.** నిర్దోషిత్వానికి వ్యతిరేకంగా దాఖలయిన అప్పీలులో జోక్యం చేసుకునే పరిధి పరిమితం. సాక్ష్యము యొక్క విశ్లేషణ వైరుద్ధ్యంగా ఉందని హైకోర్టు కనుగొనకపోతే, ట్రయల్ కోర్టు నమోదు చేసిన నిర్దోషిత్వ నిర్ధారణలో హైకోర్టు జోక్యం చేసుకోకూడదు.

**22.** **బిర్ సింగ్ వర్సెస్ ముఖేష్ కుమార్** (పైన పేర్కొన్న) కేసులో ఈ న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై న్యాయవాది శ్రీ ప్రభాకర్ ఆధారపడటానికి సంబంధించినంత వరకు, ఈ కేసులో నిందితుడిని ట్రయల్ కోర్టు దోషిగా నిర్ధారించింది, అప్పీలేట్ కోర్టు ఈ నేరారోపణను కొనసాగించింది, హైకోర్టు తన పునర్విమర్శ అధికార పరిధిలో జోక్యం చేసుకుని నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది. నేరనిర్ధారణ ప్రక్రియా స్మృతి , 1973 (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973) లోని సెక్షన్ 482 కింద హైకోర్టు పునర్విమర్శ అధికార పరిధిని ఉపయోగించే ప్రక్రియలో, కేసులో చట్టవైరుధ్యం లేనప్పుడు,

కేసువాస్తవాల యొక్క ఉమ్మడి ఫలితాలను మార్చరాదు అని ఈ న్యాయస్థానం కనుగొంది. ఏదేమైనా, ఈ కేసులో, ఫిర్యాదుదారుడి ఆర్థిక సామర్థ్యానికి సంబంధించి నిందితుడు సాక్ష్యము ఇవ్వలేదు. ఒకసారి చెక్కుపై సంతకం చేసి, నిందితుడు అప్పగించిన తర్వాత, ఎటువంటి రుణాన్ని తీర్చడానికి అట్టి చెక్కును జారీ చేయబడలేదు అని చూపించడానికి ఎటువంటి బలమైన సాక్ష్యము లేనప్పుడు, దానికి ఎన్.ఐ.చట్టము సెక్షన్ 139 లోని పురోభావన వర్తిస్తుందని ఈ న్యాయస్థానం తెలియజేసింది.

23. **కళామణి టెక్స్ మరియు ఇతరులు వర్సెస్ పి .బాలసుబ్రమణియన్** అనే (పైన పేర్కొన్న) కేసులో ట్రయల్ కోర్టు ఫిర్యాదును కొట్టివేసింది. ఫిర్యాదుదారుని ద్వారా దాఖలైన అప్పీలు అనుమతించబడింది మరియు నిందితులు ఎన్.ఐ.చట్టము సెక్షన్ 138 కింద శిక్షార్హమైన నేరానికి దోషులుగా నిర్ధారించబడ్డారు. అసలు నిందితుడి ద్వారా వేయబడిన అప్పీలులో, ఈ న్యాయస్థానం హైకోర్టు ఉత్తర్వులను ధృవీకరిస్తూ ఇలా పేర్కొంది:

> “18. కక్షిదారుల మధ్య అంగీకరించబడిన వ్యాపార సంబంధం ఉందనే వాస్తవాన్ని మేము పరిగణనలోకి తీసుకున్నాము, అప్పీలుదారులు రక్షణ ద్వారా లేవనెత్తిన వారి రక్షణాధారాలు "ప్రాముఖ్య సంభావ్యత" పట్ల విశ్వాసాన్ని ప్రేరేపించలేదు లేదా ప్రమాణాన్ని చేరుకోలేదు. ఇతర సంబంధ్ధ ఆధారాలు లేనందున అప్పీలుదారుల రక్షణాధారం (డిఫెన్స్)ను విస్మరించడంలో మరియు ఎన్ .ఐ.చట్టంలోని సెక్షన్ 118 మరియు సెక్షన్ 139 ప్రకారం అప్పీలుదారుల మీద విధించిన బాధ్యత తదితర విషయాలలో హైకోర్టు ఏ పొరపాటు చేయలేదు అని మాకు కనిపిస్తుంది.”

24. ఈ విధంగా, పైన పేర్కొన్న కేసు వాస్తవాల ద్వారా తెలిసేదేమనగా, అప్పీలుదారులు/నిందితులు లేవనెత్తిన రక్షణాధారం "ప్రాముఖ్య సంభావ్యత" ప్రమాణానికి అనుగుణంగా లేదని లేదా విశ్వాసాన్ని ప్రేరేపించలేనిదని ఈ న్యాయస్థానం కనుగొంది.

25. ప్రస్తుత కేసులో, అప్పీలుదారుడు లేవనెత్తిన రక్షణాధారం "సంభావ్యత యొక్క ప్రాముఖ్యత" ప్రమాణాన్ని సంతృప్తిపరుస్తుందని మేము గణనీయ అభిప్రాయాన్ని కలిగి ఉన్నాము.

**26. రోహిత్ భాయ్ జీవన్ లాల్ పటేల్ వర్సెస్ గుజరాత్ రాష్ట్రం మరియు ఇతరులు** (పైన పేర్కొన్న) కేసులో ఈ న్యాయస్థానం తీర్పుపై ఆధారపడటానికి సంబంధించినంతవరకు ఏమిటంటే, ఇందులో పేర్కొన్న కేసులో, ట్రయల్ కోర్టు నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది, అప్పీలులో హైకోర్టు నిర్దోషిగా ప్రకటించడాన్ని తిప్పికొట్టింది మరియు ఎన్.ఐ.చట్టము సెక్షన్ 138 కింద శిక్షార్హమైన నేరానికి నిందితుడిని దోషిగా నిర్ధారించింది. హైకోర్టు తీర్పును ధృవీకరిస్తూ, ఈ న్యాయస్థానం తెలియజేసినది ఏమనగా, కేవలం తిరస్కరణ ద్వారా లేదా కేవలం సందేహాన్ని సృష్టించడం ద్వారా, ఎన్.ఐ.చట్టము సెక్షన్ 139 ప్రకారం జనించే పురోభావనను నిందితుడు ఖండించినట్లు చెప్పలేమని పేర్కొంది. తన కేసును సమర్థిస్తూ నిందితుడి తరపున బలమైన సాక్ష్యము సమర్పించకపోతే, ఎన్.ఐ.చట్టము సెక్షన్ 139 ప్రకారం ఉన్న పురోభావనను ఖండించలేమని ఈ న్యాయస్థానం తెలిపింది. అందువల్ల, పేర్కొన్న తీర్పు ప్రస్తుత కేసు వాస్తవాలకు వర్తించదు.

**27.** ఈ విషయంలో అట్టి దృక్పథంతో, అప్పీలుదారుని నిర్దోషిగా ప్రకటించిన ఉత్తర్వును తిప్పికొట్టడంలో హైకోర్టు సమర్థనీయం కాదని మేము మరొక గణనీయ అభిప్రాయంతో ఉన్నాము.

**28.** మేము ఇప్పుడు సివిల్ అప్పీళ్ళని పరిశీలిస్తాయి . సివిల్ అప్పీళ్ల విషయానికొస్తే, ట్రయల్ కోర్టు దావాలను కొట్టివేయగా , హైకోర్టు రెండు వేర్వేరు తీర్పులు మరియు ఆదేశాల ద్వారా అప్పీళ్లను అనుమతిస్తూ ట్రయల్ కోర్టు యొక్క తీర్పులు మరియు ఆదేశాలను తిరగరాసింది . చట్టం యొక్క స్థిర ప్రతిపాదనల ప్రకారం ఋజువు యొక్క ప్రామాణికత సివిల్ కేసులలో మరియు క్రిమినల్ కేసులలో భిన్నంగా ఉంటుంది.

**29.** ప్రస్తుత విషయంలో, క్రిమినల్ కేసుల మరియు సివిల్ కేసుల మధ్య ఒక ప్రత్యేకమైన యదార్థం ఏమిటంటే, క్రిమినల్ కేసులలో ఫిర్యాదుదారు ప్రామిసరీ నోట్లను సమర్పించడంలో విఫలమైనప్పటికీ, సివిల్ కేసులలో ఫిర్యాదుదారు ప్రామిసరీ నోట్లను నిరూపించారు. సివిల్ అప్పీళ్లను సంభావ్యత యొక్క ప్రాధాన్యత ఆధారంగా నిర్ణయించాల్సిన అవసరం ఉందని హైకోర్టు కనుగొంది. ఫిర్యాదుదారుడు తాను ఎల్.ఐ.సి. ఏజెంటుగా పనిచేస్తున్నానని, తన తండ్రికి విస్తృతమైన వ్యవసాయ ఆస్తులు ఉన్నాయని తద్వారా అతను వ్యవసాయ ఆదాయాన్ని పొందుతున్నాడని నిరూపించినట్టు హైకోర్టు కనుగొంది. కేసురికార్డులో ఉన్న సాక్ష్యాల ఆధారంగా, సంభావ్యత యొక్క ప్రాధాన్యతపై ఆధారపడిన

సాక్ష్యము ద్వారా, 20 అక్టోబర్ 1998 నాటికి రూ.3..లక్షల మొత్తాన్ని రుణంగా ఇచ్చే ఆర్థిక సామర్థ్యం వాదికి ఉందని హైకోర్టు నిర్ధారణకు వచ్చింది. రక్షణ సంభావ్యతను స్థిరీకరించడానికి అప్పీలుదారుడు తన భార్యను ఈ కేసులో సాక్షిగా విచారించలేదని కూడా హైకోర్టు గమనించిన మరొక విషయము . అందుబాటులో ఉన్న ఉత్తమ సాక్ష్యాలను ప్రతివాదులు(ఇక్కడి అప్పీలుదారులు) నిలిపివేసినందువల్ల, ప్రతికూల అనుమితి సూత్రం కూడా వర్తిస్తుందని హైకోర్టు తెలియజేసింది.

**30.** క్రిమినల్ కేసుల ప్రక్రియలో వెలువడిన న్యాయ నిర్ణయమును దృష్టిలో ఉంచుకుని హైకోర్టు ముందు వాదించాలని కోరినప్పటికీ, సివిల్ దావా(లు) కూడా కొట్టివేయబడతాయి, హైకోర్టు యొక్క సరియైన పరిశీలన ఏమనగా సివిల్ కేసుల విషయాలలో న్యాయ నిర్ణయము అనేది సంభావ్యత యొక్క ప్రాధాన్యతపై ఆధారపడి ఉంటుంది, క్రిమినల్ కేసుల విషయాలలో నిందితుడు నిర్దోషిగా భావించబడును మరియు నిందితుడి నేరాన్ని పూర్తిగా నిరూపించాలి, రుజువు అనేది అన్ని సహేతుకమైన సందేహాలను అధిగమించినదిగా ఉండాలి అనే సూత్రంపై ఆధారపడి ఉంటుంది.

**31.** కాబట్టి, సివిల్ అప్పీళ్ళలో హైకోర్టు ఆమోదించిన తీర్పులు మరియు ఆదేశాలతో జోక్యం చేసుకోవడానికి మాకు ఎటువంటి కారణం కనిపించలేదు. అయితే కేసు యొక్క వాస్తవాలు మరియు పరిస్థితుల దృష్ట్యా, మేము డిక్రీని సవరించడానికి మొగ్గు చూపుతున్నాము. ఈ న్యాయస్థానం ముందు విచారణలు పెండింగులో ఉన్న సమయంలో, అప్పీలుదారులు రూ.7 లక్షలను మరియు (స్పెషల్ లీవ్ పిటిషన్ [క్రిమినల్] నెం.1456/2009 నుండి ఉద్భవించిన) క్రిమినల్ అప్పీలు నెం.1978/2013లో 20 ఫిబ్రవరి, 2009న మరియు సంబంధిత కేసు (స్పెషల్ లీవ్ పిటిషన్ [సివిల్] నెం.23036/2012 నుండి ఉద్భవించిన) సివిల్ అప్పీలు నెం.10501/2013లో 13 ఆగస్టు 2012న జారీ అయిన ఉత్తర్వులకు అనుగుణంగా ఈ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అనుసరిస్తూ రూ. 2 లక్షలను జమ చేసారు. ఈ మొత్తాలను ఎప్పటికప్పుడు ఫిక్స్.డ్ డిపాజిట్ రసీదుల్లో పెట్టుబడి పెట్టాలని ఆదేశించాము. అందువల్ల, ప్రస్తుత కేసు యొక్క వాస్తవాలు మరియు పరిస్థితులానుసారం, క్రిమినల్ మరియు సివిల్ కేసుల కార్యకలాపాలలో అప్పీలుదారులు ఇప్పటికే జమ చేసిన మొత్తానికి, దానిపై వచ్చే వడ్డీకి పరిమితం చేస్తూ డిక్రీని సవరించాల్సిన అవసరం ఉందని నిర్ణయించాము.

**32.** ఫలితంగా మేము ఈ క్రింది ఉత్తర్వులను జారీ చే సాముః

(i) క్రిమినల్ అప్పీళ్లు నెం. 1978/2013 మరియు నెం.1990/2013లను అనుమతించాము. తేదీ.28 అక్టోబర్ 2008 నాటి నేరారోపణ యొక్క ఉమ్మడి తీర్పు మరియు తేదీ.30 అక్టోబర్ 2008 నాటి శిక్షను రద్దు చేస్తున్నాము. తేదీ.10 జూలై 2011న ట్రయల్ కోర్టు వెలువరించిన తీర్పు మరియు ఉత్తర్వులను ధ్రువీకరిస్తున్నాము.

(ii) సివిల్ అప్పీళ్లు నెం. 10500/2013 మరియు నెం. 10501/2013లను కొట్టివేస్తున్నాము. అయినప్పటికిని, ఈ న్యాయస్థానంలో అప్పీలుదారుల చేత ఇప్పటికే వడ్డీతో సహా జమ చేసిన మొత్తానికి పరిమితం చేస్తూ హైకోర్టు ఉత్తర్వులను సవరించడం జరిగింది.

(iii) రెండు సివిల్ అప్పీళ్ళలోని ప్రతివాదులు ఈ న్యాయస్థానంలో జమ చేసిన మొత్తంలో 50% మొత్తాన్ని ఇప్పటి వరకు వచ్చిన వడ్డీతో సహా ఉపసంహరణ చేసుకోవడానికి అర్హులు.

**33.** ఖర్చులకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు ఇవ్వబడలేదు . ఏవైనా పెండింగులో ఉన్న దరఖాస్తులు ఉంటే అవి ముగుస్తాయి.

**.....న్యాయమూర్తి**

**[బి. ఆర్. గవాయ్]**

**.... న్యాయమూర్తి**

**[ఎం. ఎం. సుందరెష్]**

**న్యూఢిల్లీ; జనవరి 18, 2023.**